
ఈనాడు
పార్వతీపురం మన్యం
ఆదివారం అక్టోబరు 6, 2024

కనులపండువగా తెప్పోత్సవం




సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సాలూరు పంచముఖేశ్వరస్వామి ఆలయంలో తెప్పోత్సవం నిర్వహించారు. శనివారం ఉదయం పార్వతీదేవి, అమ్మవార్ల విగ్రహాల వద్ద 50 మంది దంపతులు హోమాలు, లలితా పారాయణం చేశారు. సాయంత్రం స్థానిక పుష్కరిణిలో తెప్పోత్సవం నిర్వహించారు. పట్టణానికి చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

గిరిజన సంక్షేమ ఈఈగా కుమార్



పార్వతీపురం, న్యూస్‌టుడే: పార్వతీపురం గిరిజన సంక్షేమ డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీరుగా కేవీఎస్ఎన్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. పాలనాపరమైన కారణాలతో ఆయన శ్రీశైలం ఐటీడీఏలో పనిచేస్తూనే ఇక్కడ ఇన్‌ఛార్జిగా విధులు నిర్వర్తించనున్నారు. శనివారం డీఈలతో సమావేశమయ్యారు. ఆర్టికల్ 275(ఎ) కింద ప్రతిపాదించాల్సిన పనుల వివరాలు సేకరించారు. గిరిజన విద్యాసంస్థల్లో వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.

43 దుకాణాలకు 117 దరఖాస్తులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: నూతన మద్యం విధానం అమలులో భాగంగా దుకాణాల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. జిల్లాలో 52 దుకాణాలకు అవకాశం ఉండగా 43 చోట్ల నుంచి 117 దరఖాస్తులు వచ్చాయని అబ్కారీ శాఖ ఏఈఎస్ జీవన్ కిశోర్ వెల్లడించారు. ఈ ప్రక్రియను శనివారం పార్వతీపురం సబ్ కలెక్టరు అశుతోష్ శ్రీవాత్సవ్ పరిశీలించారు. ఈ నెల 9 వరకు దరఖాస్తుల స్వీకరణ, 11న కలెక్టరేట్‌లో డ్రా తీయనున్నట్లు చెప్పారు.



దరఖాస్తులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టరు అశుతోష్ శ్రీవాత్సవ్

మీ చూపు.. సజీవం

ఆదివారం ప్రత్యేకం

సర్వేంద్రియానాం నయనం ప్రధానం.. కళ్లు సృష్టిని చూడలేకపోతే.. జీవితం మోడుబారినట్లు భావిస్తాం.. అలాంటి వారి బతుకుల్లో నేత్రదానం వెలుగులు నింపుతోంది. **పుట్టుక.. మరణం మన చేతుల్లో లేవు.. కానీ అవయవ దానంతో ఎంతో మందికి ప్రాణం పోసే అవకాశం ఉంది..** ఇది తెలుసుకుని చాలా మంది కుటుంబీకులు, తమ ఆత్మీయుల మరణానంతరం దుఃఖసాగరంలోనూ కళ్లను దానం చేసేందుకు ముందుకు రావడం గొప్ప విషయం.

–న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం, విజయనగరం వైద్య విభాగం



- 15 రోజుల కిందట మోదవలస సమీపంలో లారీ, కారు ఢీకొన్న ప్రమాదంలో ఎ.శ్యామ్, ఎన్.మనోజ్ కుమార్ అక్కడికక్కడే చనిపోయారు. కుటుంబ సభ్యులు బాధలోనూ మానవత్వంతో నేత్రదానానికి ముందుకు వచ్చారు.



- ఇటీవల సీతానగరం మండలం అంకలాం గ్రామానికి చెందిన వారణాసి అప్పలనరసమ్మ కన్నుమూశారు. విజయనగరం రెడ్‌క్రాస్ సొసైటీ నేత్ర విభాగం వారు రెండు నేత్రాలు సేకరించి విశాఖలో ఇద్దరికి అమర్చారు.

గత 30 రోజుల్లో అయిదుగురు, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 88 మంది నేత్రదానం చేశారు. పార్వతీపురం మన్యంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 30 మందికి కంటిచూపు భాగ్యం కలిగింది. ఒకప్పుడు అంగీకార పత్రాలు ఇచ్చినప్పటికీ చనిపోయాక దానం చేసేందుకు కుటుంబ సభ్యులు వివిధ అపోహలతో ముందుకు వచ్చే వారు కాదు. 'నేత్రదానం చేయండి.. మీ వాళ్లను వేరొకరి కంటి చూపులో చూసుకోండని' వైద్య వర్గాలు ఈ మధ్య అవగాహన కల్పిస్తుండటంతో మంచి ఫలితాలు వస్తున్నాయి.




అవగాహన కల్పిస్తున్న దృశ్యం (పాత చిత్రం)

6 గంటల లోపే..

వ్యక్తి చనిపోయిన తర్వాత కళ్లు ఆరు గంటలు జీవంతోనే ఉంటాయి. ఆ లోపు సేకరించి భద్రపర్చి మూడు రోజుల్లో వేరొకరికి శస్త్రచికిత్స ద్వారా కంటిచూపును ఇవ్వొచ్చు. ఉమ్మడి జిల్లాల పరిధిలో సేకరించే కార్నియాలను విశాఖ మోషిన్ ఆసుపత్రికి తరలిస్తారు. అక్కడ పేర్లు నమోదు చేసుకున్న అంధులకు ప్రాధాన్యత ప్రకారం అమర్చుతారు.

కంటి అంధత్వ నివారణ సంస్థ వద్ద సేకరించిన కార్నియాలు ఇలా..



ఉమ్మడి జిల్లాలో ఐ-బ్యాంకు లేదు. సేకరించిన కార్నియాలను భద్రపర్చి, విశాఖలోని ఐ-బ్యాంకులకు తరలించాలి. ఒకప్పుడు ఇది కష్టమైన ప్రక్రియ. కానీ ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఒక అడుగు ముందుకేసి తాము విశాఖ తరలిస్తామని హామీ ఇవ్వడంతో దాతలు ముందుకు రావడం ప్రారంభించారు. ఈ మేరకు మహారాజా ప్రభుత్వ ఆసుపత్రి, పార్వతీపురం అంధత్వ నివారణ సంస్థ కంటి వైద్య విభాగం వైద్యులు, సిబ్బంది కార్నియాల సేకరణ ప్రక్రియను వేగవంతం చేశారు.

2014లో తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్నియాల సేకరణ బాగా జరిగింది. ఆ తర్వాత 2019లో అధికారంలో వచ్చిన వైకాపా ప్రభుత్వం దీన్ని పూర్తిగా వదిలేసింది.

ఇలా చేయాలి

నేత్రదానం చేయాలనుకున్న వాళ్లు మరణించిన వ్యక్తి వద్ద ఫ్యానులు ఆపేసి, ఎయిర్ కండీషనర్, కూలర్ వంటివి ఉంచాలి. తడిపిన దూదిని ఐస్‌తో పాటు మూసిన కంటిపై ఉంచాలి. తలఎత్తుగా ఉండేలా దిండు పెట్టాలి.

అవగాహన పెంచుతున్నాం

ఒకరి నేత్రాలు ఇద్దరి అంధులకు చూపునిస్తుందని జిల్లాలో కల్పిస్తున్న అవగాహన మంచి ఫలితాలు ఇస్తుంది. దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి సమాచారం ఇవ్వాలని కోరుతున్నాం. దీనికి మంచి స్పందన కనిపిస్తుంది.

- జి.నగేష్‌రెడ్డి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ జిల్లా నేత్ర అధికారి, శ్యామల, జిల్లా ఆసుపత్రి ఆర్ఎంవో, నేత్ర వైద్య నిపుణులు

సంప్రదించాల్సిన చరవాణి నంబర్లు: ● రెడ్‌క్రాస్ అధ్యక్షుడు: 94418 73677 ● సాంకేతిక నిపుణుడు: 90143 27168 ● ఎంట్రీ ఆపరేటర్: 77992 94294

దీపావళి నుంచి ఉచిత సిలిండర్లు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సంధ్యారాణి, అధికారులు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు.. కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు దీపావళి నుంచి ఇస్తుందని మంత్రి సంధ్యారాణి పేర్కొన్నారు. శనివారం సాలూరులో జరిగిన 'మహిళా రక్షణ సదస్సు'లో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రానికైనా, అవి ఉన్న గ్రామాలకైనా రహదారి కావాలంటే చెప్పాలని, మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. మహిళా సాధికారతకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకే దక్కుతుందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. రాష్ట్రంలో మహిళలు 70 శాతం, పురుషులు 84 శాతం చదువుకుంటున్నారని, ఈ పరిస్థితి మారాలని జేసీ శోభిత సూచించారు. చట్టాలపై మహిళలకు అవగాహన కల్పించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఏసీపీ అంకిత సురాన తెలిపారు. ఐసీడీఎస్ ప్రాంతీయ సంయుక్త సంచాలకురాలు చిన్మయదేవి, పీడీలు రాణి, శాంతకుమారి, విజయనగరం డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి, డీఈవో పగడాలమ్మ పాల్గొన్నారు. ఆడపిల్లలపై జరుగుతున్న వేధింపులపై కేజీబీవీ బాలికలు చేసిన నృత్యం కంటతడి పెట్టించింది.


చిన్నా.. ఓనమాలు దిద్దడానికి వెళ్దామా..

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

గత ప్రభుత్వం చిన్నారులకు అక్షరాలు దిద్దే బడులను దూరం చేసింది. విద్యా విధానంలో వారి భవిష్యత్తుకు పునాది అయిన ప్రాథమిక పాఠశాల వ్యవస్థను వైకాపా అనాలోచిత నిర్ణయాలతో విలీనం అంటూ నిర్వీర్యం చేసింది. కొన్నిచోట్ల అవి మూతపడితే.. మరికొన్ని చోట్ల దూరంగా వెళ్లి చదువుకోలేక విద్యకు దూరమయ్యారు. కూటమి ప్రభుత్వం విలీనం రద్దు చేసింది. ఇందుకు జీవో-177 ఇవ్వడంతో ప్రాథమిక బడులకు పూర్వవైభవం రానుంది.



మూడు తరగతులు వెళ్లిపోవడంతో అరకొర విద్యార్థులతో ఉన్న కట్టా సరస్వతమ్మ పాఠశాల



గతంలో జిల్లావ్యాప్తంగా 1,421 ప్రాథమిక పాఠశాలలు ఉండేవి. జీవో-117తో 129 ఉన్నత పాఠశాలల్లో విలీనమయ్యాయి. దీంతో ప్రాథమిక విద్యా విధానం గాడి తప్పింది. పాఠశాల దూరంగా ఉండటంతో చిన్నారులు 3, 4, 5 తరగతులకు దూరమయ్యారు. అక్కడి తరగతి గదులు చాలక ఇబ్బందులూ ఎదురయ్యాయి. మరోవైపు ఒకటి, రెండు తరగతులు ఉన్న చోట గదులు వృథాగా.. విద్యార్థులు లేక వెలవెలబోయాయి.

- పట్టణానికి చెందిన కట్టా సరస్వతమ్మ పాఠశాలలో 120 మంది ఉండేవారు. 3, 4, 5 తరగతులు సమీపంలోని బాలికోన్నత బడిలో విలీనం చేశారు. ప్రస్తుతం 20 మంది లోపు ఉన్నారు.
- గతంలో జిల్లావ్యాప్తంగా 87 వేలకుపైగా ఉన్న విద్యార్థులు విలీన ప్రక్రియతో 66 వేలకు తగ్గిపోయారు.

లోకేశ్ ప్రత్యేక దృష్టి

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్ గతంలో పాదయాత్ర సమయంలో జీవో-117పై వచ్చిన వినతులు పరిశీలించారు. ప్రాథమిక విద్యను దెబ్బతీసే జీవో రద్దు చేస్తూ నిర్ణయం తీసుకునేలా కృషి చేశారు. ఆపై విలీన ప్రక్రియను రద్దు చేస్తూ ప్రకటన ఇవ్వడంతో ప్రాథమిక విద్య గాడిన పడుతుందని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎ.సూర్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ నిర్ణయం ప్రకారం..

విలీన ప్రక్రియపై ప్రభుత్వ నిర్ణయం ప్రకారం..పాఠశాలల నిర్వహణ చేపడతాం. గతంలో మాదిరిగా 3, 4, 5 తరగతులు పూర్వ బడులకు వెళ్తాయి.

- పగడాలమ్మ, డీఈవో, పార్వతీపురం

ఏనుగులతో ఆటలాడొద్దు



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న రేంజర్

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో సంచరిస్తున్న ఏనుగులతో ప్రజలు ఆటలాడొద్దని, జాగ్రత్తగా ఉండాలని రేంజర్ రాంనరేష్ సూచించారు. కరిరాజులు తాన్నవలస నుంచి ములగ, డోకిశీల మీదుగా పుట్టూరులోని తోటల్లోకి చేరుకున్నాయి. వీటిని చూసేందుకు సమీప ప్రాంతాల నుంచి ప్రజలు ఎక్కువగా రావడంతో సిబ్బందితో కలిసి వెళ్లారు. వాటిని రెచ్చగొట్టినా, రాళ్లు రువ్వినా దాడులు చేస్తాయని హెచ్చరించారు. ప్రత్యేక రేంజర్ మణికంఠేష్, ఫారెస్టర్ మనోజ్ తదితరులు ఉన్నారు.

ఈ పంటలో నమోదు తప్పనిసరి

సీతానగరం, న్యూస్‌టుడే: జిల్లావ్యాప్తంగా సాగవుతున్న అన్ని పంటల వివరాలు ఈ-పంటలో నమోదు కావాలని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం సీతానగరం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. కాశాపేట రెవెన్యూలో పొలాలకు వెళ్లి ఈ-పంట నమోదు పునఃపరిశీలన చేశారు. అధికారుల నుంచి వివరాలు సేకరించారు. చినబోగిలలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సరకుల దస్త్రాలు, నిల్వలు సరిచూశారు. పిల్లలు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి రాబర్ట్‌పాల్, తహసీల్దారు రాములమ్మ, ఏవో అవినాష్, సీఐ పద్మావతి, సిబ్బంది పాల్గొన్నారు.



కాశాపేటలో వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, అధికారులు

చెరువంతా సాధన

ఈ చిత్రం చూడండి.. ఎవరో నీటిలో మునిగిపోతుంటే సాయం చేయడానికి మిగతా వారంతా చెరువులో దిగినట్లు కనిపిస్తోంది కదూ. . కానీ అదేం కాదండోయ్.. వీరంతా ఈత సాధన చేస్తున్న పోలీసులు. శనివారం విజయనగరం మండలం గుంకలాం గ్రామ సమీప చెరువులో కనిపించింది దృశ్యం. –ఈనాడు, విజయనగరం



నిలకడగా బాధితుల ఆరోగ్యం

పాచిపెంట, న్యూస్‌టుడే: అతిసారంతో ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న ముగ్గురు వ్యక్తుల ఆరోగ్యం నిలకడగా ఉందని మంత్రి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని విశ్వనాథపురాన్ని శనివారం ఆమె జేసీ శోభికతో కలిసి సందర్శించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని పరిశీలించారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్షించి, అతిసారానికి గల కారణాలపై ఆరా తీశారు. ఈ నెల 2 నుంచి శనివారం వరకు 45 మంది బాధితులను గుర్తించామని వైద్యులు నివేదించారు. మంచినీటి పథకం ద్వారా సరఫరా అవుతున్న నీటిని, బాధితుల నుంచి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపినట్లు వివరించారు. ఈ ఘటనలో బంగారమ్మ, సీతన్న మృతి చెందడం బాధాకరమని, సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామని మంత్రి తెలిపారు. అతిసారం పూర్తిగా అదుపులోకి వచ్చే వరకు వైద్య శిబిరాన్ని కొనసాగించాలని ఎంపీడీవో పాత్రో, డీడీఎం హెచ్‌వో పద్మ, వైద్యులు రఘుకుమార్, వెంకటరమణకు సూచించారు.



గ్రామంలో పర్యటిస్తున్న సంధ్యారాణి, శోభిక

పైడితల్లికి దాతల భక్తిపూర్వక వితరణ

విజయనగరం కంటోన్మెంట్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర ఇలవేల్పు విజయనగరం పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా నగరానికి చెందిన పలువురు దాతలు తమ శక్తికొలది వితరణకు ముందుకు వస్తున్నారు. మొక్కుల్లో భాగంగా అమ్మవారికి శనివారం నగరంలోని వసంత విహార్‌కు చెందిన సత్యనారాయణ, సీతారామమ్మ రూ.2 లక్షల విలువ చేసే అన్నదానం షెడ్డును నిర్మించి ఇచ్చారు. గాడీఖానాకు చెందిన జ్ఞానప్రకాశ్ రూ.లక్ష విలువ చేసే భోజనానికి ఉపయోగించే స్టీల్ టేబుళ్లు, కృష్ణారావు రూ.25 వేల విలువ చేసే 60 కుర్చీలు అందజేశారు. మరో భక్తుడు బి.శ్రీరామమూర్తి చదురుగుడిలో అమ్మవారి అన్నదానానికి రూ.1.01 లక్షలు చెక్కు రూపంలో ఏసీ ప్రసాదరావు, దేవస్థానం సిబ్బంది సమక్షంలో అందజేశారు.



నూతనంగా నిర్మించిన షెడ్డులో అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న భక్తులు

సెల్‌పాయింట్‌లో రజతోత్సవం, దసరా ఆఫర్లు

విశాఖపట్నం (కార్పొరేషన్), న్యూస్‌టుడే: మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల రిటైలర్ సెల్‌పాయింట్ ఇండియా లిమిటెడ్ రజతోత్సవం, దసరా పండుగ సందర్భంగా అద్భుతమైన ఆఫర్లు ప్రకటించింది. లక్కీడ్రాలో మోటార్‌బైక్‌లు, మొబైల్‌ఫోన్లు బహుమతులుగా గెలుచుకోవచ్చని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్‌ప్రసాద్ పాండే తెలిపారు. డెబిట్‌కార్డు, ఈఎంఐ, క్రెడిట్ కార్డు ఈఎంఐలతో సహా వడ్డీలేని సులభమైన పద్ధతిలో చెల్లించే సదుపాయం కల్పించారు. ఒప్పో ఎఫ్ 27 5జి సిరీస్, రెనో 12ప్రో 5 జి కొనుగోలుపై రూ.10 లక్షల వరకు పొందే అవకాశం, కొన్ని ఎంపిక చేసిన ఉత్పత్తులపై రూ.20వేల వరకు తగ్గింపు, భాగస్వామ్య బ్యాంకుల ద్వారా 10శాతం వరకు తక్షణ క్యాష్‌బ్యాక్ సదుపాయం, అప్‌గ్రేడ్, మార్పిడి చేయడం ద్వారా రూ.20వేల వరకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. శ్యామ్‌సంగ్, ఎంఐ, ఎల్‌జీ, సోని, వర్ల్‌పూల్, హయర్, ఏస్ వంటి ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులపై 50శాతం వరకు తగ్గింపు, అన్ని బ్రాండ్ల యాక్సెసరీస్‌పై 60శాతం తగ్గింపు పొందవచ్చని తెలిపారు. సెల్‌పాయింట్ అన్ని రిటైల్ అవుట్‌లెట్స్‌లో, ఆన్‌లైన్ వేదికపై ఆఫర్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రతిపాదనలు

ఈనాడు కథనానికి స్పందన

మెంటాడ, న్యూస్‌టుడే: మండలంలోని బోడిమెట్ట సమీపంలో ఎర్రిగెడ్డపై శిథిలమై, కోతకు గురైన చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.40 లక్షల నిధులతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు నీటిపారుదలశాఖ ఏఈ జ్యోతిబాబు తెలిపారు. గత నెల 20న 'చెక్‌డ్యామ్‌కు చెదలు' శీర్షికన ఈనాడులో వెలువడిన కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించి చెక్‌డ్యామ్ అభివృద్ధికి అవసరమైన ఖర్చు అంచనాలు తయారుచేశారు. దీని పరిధిలోని ఆయకట్టు రైతులంతా కలిసి ఇసుక బస్తాలతో కోతకు గురైన ప్రాంతాన్ని పూడ్చారు.

నేటి నుంచి ఏపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

విజయనగరం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఏపీటీఎఫ్ స్థాపించి 80 వసంతాలు పూర్తయిన సందర్భంగా విజయనగరంలో 6, 7, 8 తేదీల్లో మూడు రోజులపాటు రాష్ట్ర మహాసభలు నిర్వహించనున్నారు. ఫూల్‌బాగ్‌లోని జగన్నాథ కల్యాణ మండపంలో సభల నిర్వహణకు ఏర్పాట్లుచేశారు. ఇందులో విద్యాప్రగతి, ఉపాధ్యాయుల సంక్షేమం, సమాజ శ్రేయస్సు, మహిళా సాధికారత, నూతన విద్యావిధానంపై చర్చించి తీర్మానాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పంపించనున్నారు. ప్రభుత్వ మంత్రులు, ప్రజాప్రతినిధులు, మేధావులు, విద్యావేత్తలు హాజరుకానున్నారని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.బలరామ్‌నాయుడు, ఎన్.వి.పైడిరాజు తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యావేత్తలు, విద్యావంతులు పెద్ద సంఖ్యలో హాజరై రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	130	230	240

చెత్త పన్నుకు స్వస్తి

పట్టణవాసులకు ఊరట

న్యూస్‌టుడే– రాజాం

పట్టణాల్లో వైకాపా విధించిన చెత్త పన్నును ప్రభుత్వం రద్దు చేసింది. ఎన్నికల ముందు ఇచ్చిన మరో హామీని చంద్రబాబు అమలు చేశారు. పట్టణ వాసుల నుంచి సేకరించిన చెత్తకు పన్ను వసూలు చేసేలా మునుపెన్నడూ లేని రీతిలో జగన్ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. క్లీన్ ఆంధ్రప్రదేశ్ (క్లాప్) పేరుతో దీన్ని తీసుకొచ్చారు. గృహాలు, వాణిజ్య భవనాలు, కల్యాణ మండపాలు, ఇతర ప్రైవేటు సంస్థల కార్యాలయాలు.. ఇలా విభాగాల వారీగా భారం మోపారు. ప్రజావ్యతిరేకతతో ఎన్నికల ముందు చాలా మున్సిపాల్టీల్లో వసూలు నిలిపేసినా.. ఉత్తర్వులు రద్దు కాకపోవడంతో మెడపై కత్తి వేలాడుతూ వచ్చింది. ప్రభుత్వ నిర్ణయం ఊరటనిస్తోంది.

రోజుకు ఉత్పత్తి.. (టన్నుల్లో)

జిల్లా	పట్టణాలు	అసెస్మెంట్లు	చెత్త
విజయనగరం	04	99,183	175
మన్యం	03	32,412	55



చెత్తను సేకరిస్తున్న సిబ్బంది

అమలైతే ప్రతి నెలా భారమే

చెత్త పన్ను అమల్లో ఉంటే ప్రజలు ప్రతి నెలా భారం మోయాల్సి ఉంటుంది. విజయనగరం, పార్వతీపురంలో రూ.లక్షల్లో పన్ను రాబట్టారు. రాజాం వంటి పట్టణంలో పన్ను వసూలు చేసిన సమయంలో విపరీతమైన ప్రజా వ్యతిరేకతతో తాత్కాలికంగా నిలిపేశారు.

ఇకపై లేదు

చెత్త సేకరణపై పన్ను వసూలు గతంలోనే నిలిపేశారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం. పట్టణాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించడమే లక్ష్యం. ఈ మేరకు చర్యలు తీసుకున్నాం. పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చూడాలని చెప్పాం.

–వి.రవీంద్ర, మున్సిపల్ ఆర్డీ, విశాఖపట్నం

- ❖ విజయనగరంలో పేదల ఇళ్ల నుంచి రూ.60, మధ్యతరగతి నుంచి రూ.90, వాణిజ్య సముదాయాలు, క్లినిక్‌లు, కల్యాణ మండపాలు, లాడ్జిలు తదితరాలకు రూ.150 నుంచి రూ.15 వేల వరకూ నిర్ణయించారు.
- ❖ పార్వతీపురంలో గృహాల నుంచి రూ.50, వాణిజ్య సముదాయాల నుంచి రూ.110- 220 వరకూ భారం మోపేవారు.
- ❖ రాజాం పట్టణంలోని బాబానగర్, సత్యనారాయణపురం, తెలగావీధి తదితర ప్రాంతాల్లో ప్రయోగాత్మకంగా వసూలు చేశారు. మున్సిపాల్టీకి ఎన్నికలు జరుగుతాయని తాత్కాలికంగా నిలిపేశారు.
- ❖ బొబ్బిలిలో ప్రజా సంఘాలు వ్యతిరేకించడంతో వెనక్కి తగ్గారు.
- ❖ పాలకొండ నాలుగో వార్డులో రెండు నెలల పాటు చెత్తపన్ను రాబట్టారు.
- ❖ సాలూరు మున్సిపాల్టీలో కార్యాచరణ రూపొందించినా అమలు చేయలేదు.
- ❖ నెల్లిమర్లలో 13, 14 వార్డుల్లో ఆర్నెళ్లు రూ.83 వేలు రాబట్టారు. తరువాత వసూలు నిలిపేశారు.

రహదారులే కల్లాలు



పాచిపెంట మండలంలో 6 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగైంది. ప్రస్తుతం పంట చేతికి వచ్చింది. కానీ కల్లాలు లేకపోవడంతో రైతులు ఇలా రహదారులపై ఆరబెడుతూ కనిపిస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. – న్యూస్‌టుడే, పాచిపెంట

కేంద్ర పథకాలతో గ్రామాల్లో ప్రగతి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రజలు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ప్రోత్సాహకాలతో అన్ని రంగాల్లో ప్రగతి సాధించాలని కేంద్ర పర్యావరణ పరిశోధక అధికారులు శశియప్పన్, సలీంకుమార్ సూచించారు. మండలంలోని ఎల్ఎన్ పురం పంచాయతీ పరిధిలో పర్యటించారు. ఇంజినీరింగు అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. గృహ నిర్మాణం, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, ర.భ.శాఖ పనుల తీరు, ప్రగతి గురించి తెలుసుకున్నారు. డీఎల్‌డీవో రమేష్ రామన్, డీఈఈ రత్నకుమార్, ఏఈలు చిరంజీవులు, చంద్రమౌళి, ఏపీడీలు, ఏపీవోలు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కేంద్ర బృందం ప్రతినిధులు

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం



గింబలి పద్మావతి (పాత చిత్రం)



కుక్కా శివశ్రీను (పాత చిత్రం)

గొల్లప్రోలు, తొండంగి, పాలకొండ, పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలంలోని చెందుర్తి కూడలి జాతీయ రహదారి-216పై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో తొండంగి మండలం పాత పెరుమాళ్లపురానికి చెందిన కుక్కా శివశ్రీను(20), పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండకు చెందిన గింబలి పద్మావతి(18) మృత్యువాత పడ్డారు. ఎస్సై రామకృష్ణ వివరాల ప్రకారం.. చెందుర్తి కూడలి దగ్గర మలుపు తిరుగుతున్న వ్యాను కాకినాడ నుంచి కత్తిపూడి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొన్నాయి. వ్యాను కిందికి ద్విచక్ర వాహనం దూసుకుపోవడంతో పద్మావతి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. తీవ్రంగా గాయపడిన శివశ్రీనును పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. శివశ్రీను తండ్రి మణబ్బాయి ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

చదువు కోసం వచ్చి మృత్యువాత..: చిన్నప్పట్నుంచి బాగా చదువుతోందని వ్యయప్రయాసలకోర్చి ఉన్నత చదువు కోసం పంపిస్తే దసరా సెలవుల్లో కోట దుర్గమ్మతల్లి ఉత్సవాలకోసం వస్తూ తమ బిడ్డ ఇలా మృత్యువాతపడిందని పద్మావతి తల్లిదండ్రులు, బంధువులు విలపిస్తున్నారు. పద్మావతికి కాకినాడ గ్రామీణ మండల శివారు కోరంగి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మసీ కళాశాలలో మెరిట్‌లో సీటు సాధించి బీఫార్మసీ రెండో సంవత్సరం చదువుతోంది. దసరా సెలవులు ఇవ్వడంతో ఆదివారం జరిగే కోటదుర్గమ్మతల్లి ఉత్సవాలకోసం బయలుదేరి వస్తుండగా రోడ్డు ప్రమాదం ఆమెను కబళించిందన్నారు. తండ్రి శ్రీనివాసరావు, సోదరుడు సంజయ్ డ్రైవర్లుగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. తల్లి సత్యవతి గృహిణి. కోరంగి నుంచి కత్తిపూడి వచ్చి అక్కడి నుంచి బస్సు ఎక్కి వస్తానని తండ్రితో పద్మావతి చెప్పిందని బంధువులు తెలిపారు. శనివారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో ఫోన్ చేయగా ప్రమాదం గురించి పోలీసులు చెప్పారన్నారు.

స్నేహితుడి బండిపై వెళ్లి..: ద్విచక్ర వాహనం అంటే సరదా పడేవాడని, స్నేహితుడి బండి తీసుకువెళ్లి శవమయ్యాడని శివశ్రీను కుటుంబసభ్యులు రోదిస్తూ చెప్పారు. తండ్రి మణబ్బాయి వ్యవసాయ కూలీ కాగా తల్లి సత్యవతి చిరు దుకాణం నిర్వహిస్తుంటారు. మణబ్బాయికి కుమారుడితోపాటు మరో ఇద్దరు కుమార్తెలున్నారు. శివశ్రీను డిగ్రీ ప్రైవేటుగా చదువుతూ.. రెండేళ్లుగా ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు.

ఉసురు తీసిన ఏమరుపాటు

రాజాం, న్యూస్‌టుడే: కొద్దిపాటు ఏమరపాటు నిండు ప్రాణాన్నే బలితీసుకుంది. రాజాం ఎస్సై వై.రవికిరణ్ శనివారం చెప్పిన వివరాల ప్రకారం.. మండలంలోని రాజయ్యపేటకు చెందిన టి.చిన్నారావు (35) విద్యుదాఘాతంతో శుక్రవారం మృతిచెందారు. పట్టణంలోని ఒక జూట్ కర్మాగారంలో కార్మికుడిగా పనిచేస్తున్నారు. శుక్రవారం సాయంత్రం 5 గంటలకు షిఫ్ట్ డ్యూటీ ముగించుకుని ఇంటికి వెళ్లారు. అదే పరిశ్రమలో తాను ధాన్యం నిల్వ కోసం కొనుగోలు చేసిన పాత సింటెక్స్ ట్యాంకు తీసుకురావడానికి తిరిగి 6.30 గంటల ప్రాంతంలో పరిశ్రమకు ఎడ్లబండిని తీసుకుని వెళ్లారు. మరో ఇద్దరు కార్మికుల సాయంతో ట్యాంకును బండిపైకి చేర్చారు. ట్యాంకు కదులుతుందేమోనని అక్కడే ఉన్న తీగతో కట్టేందుకు ప్రయత్నించగా.. అది విద్యుత్తు స్తంభం తీగపై పడి విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే గుర్తించి ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఏమరపాటుతో చేసిన పనికి నిండు ప్రాణమే బలైందని అక్కడి వారంతా ఆవేదన చెందారు. ఇతనికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మంత్రిని కలిసిన జనసేన నేతలు


మంత్రిని కలిసిన కౌన్సిలర్లు, నాయకులు

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: నాయకులు, ప్రజలు, అధికారులు కలిసి సమష్టిగా నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేస్తామని జనసేన నేతలు తెలిపారు. శనివారం మంత్రి సంధ్యారాణిని సాలూరు పురపాలిక కౌన్సిలర్లు, నాయకులు కలిశారు. పట్టణంలో సమస్యలను ఆమె దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రిని కలిసిన వారిలో పుర ఉపాధ్యక్షురాలు జె.దీప్తి, కౌన్సిలర్లు ఆర్.మాధవ, పి.లక్ష్మణరావు, ఎల్.దుర్గ, నాయకులు ఈశ్వరరావు, సూరిబాబు, దిలీప్, వి.వెంకటేశ్, హరి సోమునాయుడు తదితరులు ఉన్నారు.

ప్రకృతి చిత్రం.. ప్రేమకు రూపం

ఇన్నాళ్లు ఆ ప్రాంతంలో ఎందరికో నీడనిచ్చిన చెట్టు పూర్తిగా ఎండిపోయి మోడు వారింది. చివరగా మిగిలిన మొదలకు ఓ తీగజాతి మొక్క ప్రేమను పంచుతున్నట్లు అల్లుకొంది. గుమ్మలక్ష్మీపురం మండలంలోని ఎల్విన్‌పేట నుంచి కేదారిపురం వెళ్లే ప్రధాన రహదారిపై ప్రయాణించే వారిని ప్రకృతి గీసిన ఈ చిత్రం ఆకట్టుకుంటోంది.
– న్యూస్‌టుడే, గుమ్మలక్ష్మీపురం



అన్నప్రసాదం మంచి కార్యక్రమం


అన్నం వడ్డిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, నాయకులు

పాలకొండ, న్యూస్‌టుడే: కోటదుర్గమ్మ దర్శనానికి వస్తున్న భక్తులకు అన్నప్రసాదం అందించడం మంచి కార్యక్రమమని ఎమ్మెల్యే జయకృష్ణ పేర్కొన్నారు. శనివారం ఆలయ ఆవరణలో సొంత నిధులతో ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను ఆయన ప్రారంభించారు. ఈ ఏడాది కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా జరుగుతున్నాయని అభినందించారు. తెదేపా పట్టణ, మండలాధ్యక్షులు గంటా సంతోష్, గండి రామినాయుడు, వెన్నపు శ్రీనివాసరావు, అంపోలు శ్రీను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM)

పార్వతీపురం	8008566244
పాలకొండ	8008574299
సాలూరు	8008786820
కురుపాం	9849044696

?: జియ్యమ్మవలస మండల కార్యాలయ భవనంపై పనికిరాని మొక్కలు పెరిగి గోడలు పాడవుతున్నాయి. - స్థానికులు

❖ మొక్కల తొలగింపునకు చర్యలు తీసుకుంటాం. - కె.రామారావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో
– న్యూస్‌టుడే, జియ్యమ్మవలస

?: సీతానగరం - అజ్జాడ రహదారి పక్కన పొదలు పెరిగిపోయాయి. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. - ఆదినారాయణ

❖ పరిశీలించి తొలగిస్తాం. - రామ్మోహన రావు, ఏఈ, ర.భ.శాఖ - సీతానగరం

?: వెంకటరాయుడుపేట గ్రామం వద్ద ఖానా పొక్కింది. పొక్కి ఐదురోజులు అవుతోంది. కానీ బాగు చేయలేదు. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - రమేష్

❖ పరిశీలించి ఖానా బాగు చేయిస్తాం. - రత్నకుమార్, పీఆర్, డీఈఈ, పార్వతీపురం
– పార్వతీపురం గ్రామీణం.

?: వెంగాపురం ఎస్సీ కాలనీ ప్రధానమిల్లు పక్కన మురుగు కాలువ నీరు రోడ్డుపైకి వస్తోంది. - కాలనీ ప్రజలు

❖ సమస్యను సర్పంచి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తాం. - జి.వెంకటినాయుడు, కార్యదర్శి
– న్యూస్‌టుడే, బలిజిపేట

మిత్రమా నీ జాడెక్కడ?

అంతరిస్తున్న మిత్ర పురుగులు



భామిని, న్యూస్‌టుడే: పేరుకు పురుగులే అయినా కొన్ని రకాల కీటకాలు రైతులకు చాలా మేలే చేస్తాయి. రసాయనాల వినియోగం పెరిగిపోవడంతో వీటి జాడ కనిపించడం లేదు. క్రిమిసంహారక మందులు మోతాదుకు మించి వాడుకోవడంతో శత్రు పురుగులతో పాటు పంటలను సంరక్షించే మిత్ర పురుగులు అంతరించిపోతున్నాయి. వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పించినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

గుడ్లు తింటూ రక్షణ..

పంటను ఆశించే పచ్చ, లద్దె పురుగులు గుడ్ల ద్వారా సంతానం పెంపొందించుకుంటాయి. ఇవి పంట ఆకులు, లేత భాగాలపై గుడ్లు పెడతాయి. అలా గుడ్లు నుంచి బయటకొచ్చిన వాటి సంతతి పూత ఆకు పండేలు తింటూ పంటకు నష్టం కలిగిస్తాయి. ట్రైకో గ్రామ అనే మిత్ర పురుగు పచ్చ, లద్దె పురుగు పెట్టిన గుడ్లు తింటుంది. దీంతో శత్రు పురుగుల సంతతి పెరగకుండా పంటను రక్షిస్తుంది. అక్షింతల పురుగులు దోమ, నల్లి, తామర తదితర పురుగులను తింటాయి.


భామినిలో సాగులో ఉన్న వరి పైరు

సాలీడు, తూనీగ..

పొలాలకు సమీప తుప్పలు, చెట్లపై సాలీడు గూళ్లు ఉంటే పంటలపై పెట్టిన గుడ్ల నుంచి బయటకొచ్చిన పచ్చ, లద్దె పురుగుల సంతతి, రెక్క పురుగులు, దోమలు, నల్లిలు ఇరుక్కుపోతాయి. వీటిని సాలీడులు తిని సంతతిని నివారిస్తాయి. చీడపురుగులు పంటలపై పెట్టిన గుడ్లను తూనీగలు తినడమే కాకుండా పరపరాగ సంపర్కం జరగడానికి దోహదపడతాయి. తూనీగ ఒక మొక్కపై నుంచి మరో మొక్కపై వాలినప్పుడు ఒక పుష్పంలో ఉన్న పుప్పొడి రేణువులను మరో పుష్పంపైన వదలడంతో ఫలదీకరణం జరిగి విత్తనం పంట దిగుబడికి దోహదపడుతుంది.

రూపాయి ఖర్చు లేకుండా..

కందిరీగ, మిడత, పొడిసన్‌బగ్ వంటి మిత్ర పురుగులు పంటను ఆశించే చీడపీడ సంతతి పెరగకుండా నివారిస్తాయి. ఇలా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా రైతన్న పంటకు రక్షణగా నిలుస్తున్నాయి. కానీ కర్షకుల నిర్లక్ష్యం కారణంగా అవి నశించిపోతున్నాయి. ముఖ్యంగా క్రిమిసంహారక మందులు అతిగా పిచికారీ చేయడంతో మిత్ర పురుగులు చనిపోతున్నాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

అవసరం మేరకు వినియోగం..

“క్రిమిసంహారక మందులు అవసరం మేరకు వినియోగిస్తే మిత్ర పురుగులను రక్షించుకోవచ్చు. కొందరు మోతాదు మించి వాడటంతో వాటిపై ప్రభావం పడుతోంది. పంటపై ఒకటి, రెండు చీడ పురుగులు కనబడితే నివారణ మందులు వాడాల్సిన అవసరం లేదు.
– కె. సింహాచలం, వ్యవసాయాధికారి, భామిని”

విద్యుత్తు నియంత్రిక ఏర్పాటు


స్పందనకు వందనం

కొమరాడ, న్యూస్‌టుడే: మండలంలోని తులసివలస గ్రామంలో విద్యుత్తు నియంత్రిక లేక ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు శనివారం 'ఈనాడు' 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. వార్త ప్రచురించగా.. విద్యుత్తు శాఖ అధికారులు స్పందించారు. గ్రామంలో నియంత్రిక ఏర్పాటు చేసినట్లు ఏఈ వెంకటరమణ తెలిపారు.

వినియోగంలోకి సంపద కేంద్రం

కురుపాం గ్రామీణం: మండలంలోని పి.లేవిడి గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడ పరిసరాలు అధ్వానంగా మారాయని ఈ నెల 25న స్థానికులు ఈనాడు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలియజేశారు. వార్త ప్రచురించగా.. ఉపాధి ఏపీవో బావాజీ స్పందించారు. కేంద్రం ఆవరణలో మొక్కలు తొలగించారు.

లప్పటి- వాడబాయి రహదారికి మోక్షం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: కొండపైనున్న లప్పటి నుంచి వాడబాయి వెళ్లే రహదారి రూపు మారనుంది. రాళ్లు తేలి అధ్వానంగా మారడంతో.. ఇక్కడ కొత్త మార్గం వేసేందుకు రూ.2.80 కోట్ల ఉపాధి నిధులు మంజూరైనట్లు పీఆర్ సర్కిల్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్ తెలిపారు. సాంకేతిక అనుమతుల కోసం రహదారిని పరిశీలించారు. డీఈఈ జి.శ్రీనివాసరావు, ఏఈ మురళీధర్ ఉన్నారు.


రహదారిని పరిశీలిస్తున్న ఎస్ఈ, అధికారులు

చండీయాగంలో ఎమ్మెల్యే కళా


యాగం చేస్తున్న వెంకటరావు

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ పట్టణంలోని కాశీవిశ్వేశ్వర ఆలయంలో దసరా ఉత్సవాల్లో భాగంగా జరుగుతున్న చండీయాగంలో చీపురుపల్లి ఎమ్మెల్యే కళా వెంకటరావు పాల్గొన్నారు. వేదపండితులు ఎస్.ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో యాగం చేశారు. ఎమ్మెల్యే జయకృష్ణ, నాయకులు గంటా సంతోష్‌కుమార్, సుంకరి అనిల్‌దత్, అంపోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: యువత రక్తదానానికి ముందుకు రావాలని మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ కుమార్‌దేవ్ పిలుపునిచ్చారు. శనివారం కురుపాంలో వాయుపుత్ర సేవా సంఘం ఆధ్వర్యంలో శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 25 మంది రక్తదానం చేశారు. మాజీ జడ్పీటీసీ ఎ.కోటేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బి.గౌరీశంకరరావు, ఎస్సై నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


శిబిరం ప్రారంభిస్తున్న మాజీ ఎంపీ ప్రదీప్‌దేవ్

280 మందికి వైద్య పరీక్షలు


రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

బలిజిపేట గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని పణుకువలసలో శ్రీకాకుళం రాగోలు జెమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో జరిగిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. క్యాన్సర్, కిడ్నీ, గుండె, కీళ్ల సమస్యలతో పాటు అన్ని రకాల వ్యాధులతో బాధ పడుతున్న 280 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. బి.సింహాచలం, కె.శివ, జి.గణేష్, జి.రామ్మూర్తినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలతో మమేకం కావాలి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శులు ప్రజలతో మమేకం కావాలని ఎంపీడీవో కె.రూపేష్ సూచించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు సిబ్బంది మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం మండల పరిషత్తు కార్యాలయంలో కార్యదర్శులతో ఎంపీడీవో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. ఏవో మూర్తి ఉన్నారు. ❖ పార్వతీపురం ఈవోపీఆర్డీగా పి.రాధాకృష్ణ శనివారం బాధ్యతలు స్వీకరించారు.


ఎంపీడీవోకు మొక్క అందిస్తున్న కార్యదర్శులు

పట్టని నిబంధనలు..

కాలనీల్లో అక్రమ నిర్మాణాలు

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: పురపాలక పట్టణ ప్రణాళిక విభాగం తీరుపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. ఇన్నాళ్లు జిల్లా కేంద్రంలో నిర్మాణాలకు ఇచ్చిన అనుమతుల్లోనే పారదర్శకత పాటించలేదు అనుకుంటే. . ఇప్పుడు జగనన్న కాలనీల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ కేవలం ఇళ్ల నిర్మాణాలకు మాత్రమే అవకాశం ఇవ్వగా దుకాణాలు వెలుస్తున్నాయి. కొందరు ఖాళీ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు వాపోతున్నారు.

మిగులు స్థలాల ఆక్రమణ..

పార్వతీపురం పట్టణంలోని ప్రధాన, బైపాస్ రహదారి, వార్డుల్లోని పలు కాలువలను ఆక్రమించి నిర్మాణాలు పలువురు చేపట్టారు. కొన్ని చోట్ల రెండు అంతస్తులకు అనుమతులు తీసుకుని నాలుగు అంతస్తులు నిర్మించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికి తోడు గోపాలపురంలో కేటాయించిన జగనన్న కాలనీలో మిగులు స్థలాలను కొందరు ఆక్రమించి దుకాణాలు నిర్మించారు. అప్పట్లో ఇదే కాలనీలో అక్రమాలపై 8వ వార్డు తెదేపా కౌన్సిలర్ కె.నారాయణరావు డివిజన్, జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అప్పట్లో ఎమ్మెల్యే బి.విజయచంద్ర పరిశీలించారు. అనధికారికంగా నిర్మించిన వారికి పుర అధికారులు నోటీసులు జారీ చేసినా ఎలాంటి ఉపయోగం లేకుండా పోయింది. గోపాలపురం జగనన్న కాలనీలో 12 అక్రమ భవన నిర్మాణాలకు నోటీసులు జారీ చేసినట్లు పట్టణ ప్రణాళికా విభాగం అధికారులు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పాలకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వివిధ పోటీల్లో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానాచార్యులు డా.ఎస్.శ్యాంబాబ్ తెలిపారు. యోగాలో యు.కృపారాణి, బ్యాడ్మింటన్ పోటీల్లో వై.లక్ష్మి, కృపారాణి ఎంపికైనట్లు చెప్పారు. రాజాంలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో వై.ప్రవల్లిక, బి.వాణి, డి.అనిత, ఎల్.స్వాతి జిల్లా స్థాయిలో ద్వితీయస్థానంలో నిలిచారన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు


శాస్త్రీయ నృత్యం చేస్తున్న విద్యార్థులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల్లో భాగంగా పాలకొండ కోటదుర్గమ్మ ఆలయ ప్రాంగణంలో స్థానిక పెదకాపు వీధి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు, శివకేశవ నృత్యనికేతన్ చిన్నారులు చేసిన ప్రదర్శనలు అలరించాయి. ఉపాధ్యాయులు బి.మల్లేశ్వరరావు, కె.జనార్దనరావు భక్తిగీతాలు ఆలపించారు.

నిర్వాసితులకు అందుబాటులో వైద్యం

పార్వతీపురం పురపాలక, న్యూస్‌టుడే: జిల్లా కేంద్రం పార్వతీపురం పట్టణానికి మరో ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం రానుంది. జిల్లా ఆసుపత్రితో పాటు జగన్నాథపురం, పాత బెలగాం ప్రాంతాల్లో ఇప్పటికే పీహెచ్‌సీలు అందుబాటులో ఉన్నాయి. అయితే పార్వతీపురం- శ్రీకాకుళం రహదారికి ఇరువైపులా 5, 6, 7, 8 వార్డులు విస్తరించాయి. ఈ నేపథ్యంలో కొత్తవలస ప్రాంతానికి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మంజూరు చేయాలని 8వ వార్డు తెదేపా కౌన్సిలర్ కె.నారాయణరావు ఇటీవల ఎమ్మెల్యే బి.విజయచంద్ర దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సానుకూలంగా స్పందిస్తూ మంజూరుకు హామీ ఇచ్చారు.

ఖాళీగా భవనాలు..

కొత్తవలస ప్రధాన రహదారి, ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పక్కన నిర్మించిన గిజబ కాలనీలో మూడు భవనాలతో ప్రాథమిక పాఠశాల నిర్మించారు. కొన్నాళ్లుగా భవనం నిరుపయోగంగా మారింది. ఆ ప్రాంతంలో పీహెచ్‌సీ ఏర్పాటు చేయాలని జిల్లా పాలనాధికారి కార్యాలయానికి పురపాలక సంఘం నివేదికలు అందజేసింది. విశాల ప్రాంగణంలో అన్ని సౌకర్యాలతో భవనాలు ఉన్నందున సద్వినియోగం చేసుకుంటామని అధికారులు పేర్కొన్నారు. వైద్య పరీక్షలకు, మందుల నిల్వ, రోగుల నిరీక్షణ, మరుగుదొడ్లు కూడా ఉన్నాయని నివేదికలో తెలిపారు. కొత్తవలస ప్రధాన రహదారి, విజయరామరాజు, సాయిరాం, మణికంఠ, నందమూరి కాలనీ, పెద్దవీధి, మొండివీధి ప్రాంతాలకు చెందిన ఎనిమిది వేల మందికి ఉపయోగకరంగా ఉంటుందని తెలియజేశారు.


గిజబ కాలనీలో పీహెచ్‌సీ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలం

కలెక్టర్‌కు నివేదికలు..

ఈ ప్రాంతంలో గరుగుబిల్లి మండలం కోటవానివలస, ఆరో వార్డు పరిధిలోని నవిరి, గిజబ నిర్వాసిత కాలనీల ప్రజలు ఎక్కువగా ఉంటున్నారు. వీరికి మిగిలిన పీహెచ్‌సీలు దూరంగా ఉండటంతో చిన్న చిన్న సమస్యలకు జిల్లా ఆసుపత్రికి వెళ్తున్నారు. ఆరోగ్య కేంద్రం ఏర్పాటైతే వీరికి సేవలు దగ్గర అవుతాయని, నివేదికలు తయారు చేసి కలెక్టరేట్‌కు పంపించామని కమిషనరు కోన శ్రీనివాస్ తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వస్తే వసతుల కల్పనకు చర్యలు చేపడతామన్నారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడి ఎన్నిక


విశ్వేశ్వరరావు

సీతానగరం, పార్వతీపురం పురపాలిక, న్యూస్‌టుడే: ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడిగా సీతానగరానికి చెందిన మమ్ముల విశ్వేశ్వరరావు ఎన్నికయ్యారు. ఈ నెల 6న బాధ్యతలు చేపట్టనున్నట్లు చెప్పారు. పార్వతీపురం ఆర్య వైశ్య కల్యాణ మండపంలో ప్రమాణ స్వీకారం చేస్తారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి

గరుగుబిల్లి, న్యూస్‌టుడే: మండలంలోని నాగూరు స్వదేశీ మత్స్యకారుల పారిశ్రామిక సహకార సంఘం ఎన్నిక శనివారం జరిగినట్లు తెదేపా మండలాధ్యక్షుడు ఎ.మధుసూదనరావు, బీసీ సెల్ అధ్యక్షుడు ఎ.రాంబాబు తెలిపారు. అధ్యక్షుడిగా ఆర్.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నిక అయ్యారు. మత్స్యకారులకు రావాల్సిన రాయితీలను తీసుకొచ్చేలా కృషి చేస్తామన్నారు. ఎన్నికల అధికారి పి.మన్మథరావు పాల్గొన్నారు.

ఈ- పంట నమోదు పరిశీలన

బలిజిపేట, గరుగుబిల్లి, న్యూస్‌టుడే: రైతులు ఈ పంటలో వివరాలు నమోదు చేసుకోవాలని ఏవో శ్రావణ్‌కుమార్ సూచించారు. వెంగాపురం, చిలకలపల్లిలో పంటలను దస్త్రాల ఆధారంగా పరిశీలించి వివరాలను నమోదు చేశారు. రెవెన్యూ, ఉద్యాన శాఖల అధికారులు ఉన్నారు. ❖ గరుగుబిల్లిలో సబ్ కలెక్టరు అశుతోష్‌శ్రీవాత్సవ ఈ పంట నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏవో విజయభారతి ఉన్నారు.

అన్నపూర్ణదేవిగా పోలమాంబ


గాజుల అలంకరణలో అమ్మవారు

మక్కువ, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు శంబర పోలమాంబ అన్నపూర్ణదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్దసంఖ్యలో అమ్మవారికి పూజలు చేపట్టారు. జాతర సమయంలో సిరిమాను తిరిగే ప్రదేశాల్లో సీసీ రోడ్లు, కాలువలను పంచాయతీరాజ్ డీఈ చిన్నంనాయుడు, ఈవో వీవీ సూర్యనారాయణ పరిశీలించారు.

ఆర్థిక సాయం అందజేత

పార్వతీపురం గ్రామీణం: విజయవాడ వరద బాధితులకు అందరూ సాయం చేయాలని ఎమ్మెల్యే బి.విజయచంద్ర కోరారు. శనివారం పులిగుమ్మి గ్రామస్థులు రూ.10 వేలును ఎమ్మెల్యేకు అందించారు.

కార్యదర్శికి సత్కారం

సీతానగరం: గాంధీ జయంతి సందర్భంగా ఉత్తమ పంచాయతీ కార్యదర్శిగా అవార్డు అందుకున్న శ్రీనివాసరావుకు బగ్గందొరవలస గ్రామస్థులు శనివారం సత్కారం చేశారు. ఆయన సేవలను కొనియాడారు.

ఇసుక ఉచితంగా ఇవ్వాలి

కొమరాడ, న్యూస్‌టుడే: మండలంలోని నాగావళి నది తీరంలో ఇసుక రేవులు గుర్తించి ఉచితంగా పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సాంబమూర్తి తదితరులు కోరారు. కొమరాడ తహసీల్దారు కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. కూనేరు-రామభద్రపురం, గుమడ, కొమరాడ, కొట్టు, గుణానపురం దుగ్గి పరిసరాల్లో ఇసుక సేకరణకు అవకాశం ఉందన్నారు.

చెరకు తోట దగ్ధం

సీతానగరం: మండలంలోని నీలకంఠాపురం రెవెన్యూలో శుక్రవారం రాత్రి 5 ఎకరాల్లో చెరకు తోట అగ్నికి ఆహుతయ్యింది. పది మంది రైతులకు సంబంధించిన పంట కాలిపోవడంతో వారంతా ఆవేదన చెందుతున్నారు. తమను ఆదోకోవాలని కోరారు. పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని వీఆర్వో శ్రీనివాసరావు చెప్పారు.

శుభ్రత చర్యలేవీ..?



పాచిపెంట మండలం విశ్వనాథపురంలో అతిసారం బారిన పడి ఇద్దరు మృతి చెందారు. పలువురు ఆసుపత్రి పాలయ్యారు. గ్రామంలో రక్షిత పథకం నుంచి సరఫరా అవుతున్న నీరే కారణమని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. రెండు దశాబ్దాల క్రితం ప్రజల దాహార్తి తీర్చేందుకు 40 వేల లీటర్ల సామర్థ్యం ఉన్న ట్యాంకు నిర్మించారు. సమీపంలోని వేగవతి నదిలో ఇన్‌ఫిల్టర్ బావుల ద్వారా సరఫరా జరుగుతోంది. సంబంధిత పైపులు పాడవడంతో పాటు, ట్యాంకు మెట్లు ధ్వంసమయ్యాయి. దీంతో శుభ్రత లేదని గ్రామస్థులు వాపోతున్నారు. శుభ్రత చర్యలు చేపడతామని ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రామాంజనేయులు తెలిపారు. – న్యూస్‌టుడే, పాచిపెంట

మలుపులో పొంచి ఉన్న ప్రమాదం



కురుపాం మండలంలోని శివ్వన్నపేట నుంచి మాదలింగి వెళ్లే మార్గం మలుపులతో ప్రమాదకరంగా మారింది. ఎక్కడా హెచ్చరిక బోర్డులు, వేగ నియంత్రికలు లేవు. ఇరువైపులా పనికిరాని మొక్కలు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిపై ర.భ.శాఖ అధికారిని నిర్మల వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి సూచికలు ఏర్పాటు చేస్తామన్నారు. – న్యూస్‌టుడే, కురుపాం గ్రామీణం

తాగునీటికి అవస్థలు



పార్వతీపురం మండలంలోని దోని గెడ్డవలసలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ బోరు పనిచేయకపోవడంతో మోటారు అమర్చారు. కానీ నీరు పట్టుకొనే సమయంలో విద్యుత్తు షాక్‌కు గురవుతున్నామని పలువురు వాపోతున్నారు. ఇటీవల ఇద్దరు మహిళలకు షాక్ తగిలిందని చెబుతున్నారు. ఇప్పటికే అధికారులకు వినతిపత్రం ఇచ్చినట్లు సీపీఎం నాయకుడు శ్రీనివాసు తెలిపారు. విషయం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ బసవరాజు వద్ద ప్రస్తావించగా.. పరిశీలించి సమస్య పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం